
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
శుక్రవారం 6 జూన్ 2025



నేటి నుంచి డీఎస్సీ పరీక్షలు

● హాజరుకానున్న 33,684 మంది అభ్యర్థులు


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పూర్తిచేశారు. డీఎస్సీ పరీక్షలు ఈ నెల 6 నుంచి 30వ తేదీ వరకు కొనసాగుతాయి. నంద్యాల జిల్లా నుంచి 33,684 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టర్ రాజకుమారి తన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే మెగా డీఎస్సీ పరీక్షలకు ఎలాంటి లోపాలకు తావివ్వకుండా నిర్వహించాలని ఆమె ఆదేశించారు. జిల్లా కేంద్రంలో శ్రీరామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలు, శాంతిరామ్, ఆర్‌జీఎం, ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు, లోపాలకు తావ్వికుండా అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించామన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్షాకేంద్రాల పరిధిలో ఏ ఒక్క చిన్న సంఘటన జరగకుండా చూసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అభ్యర్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందుగా హాజరుకావాలని సూచించారు. పరీక్షాకేంద్రాలకు చేరుకునేలా సమయానికి ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఏఎస్పీ మందజావలి అల్ఫోన్స్, నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్, డీఈవో జనార్ధన్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ లీలావతి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హాస్టళ్లలో టెండర్ల గోల్‌మాల్..!

- పాత కాంట్రాక్టర్‌కు కట్టబెట్టాలని పీవో ఎత్తుగడ
- నిబంధనల పేరిట 12 మంది టెండరుదారుల తొలగింపు
- ఆందోళనతో దిగొచ్చిన పీవో.. తాత్కాలికంగా వాయిదా


సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయం

నంద్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, ప్రకాశం జిల్లాల పరిధిలోని గిరిజన సంక్షేమ హాస్టళ్లకు సరుకుల సరఫరా సంబంధించిన టెండర్ల ప్రక్రియలో గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది. గిరిజన హాస్టళ్లకు సంబంధించిన 32రకాల ప్రొవిజన్స్ సరఫరాలో భాగంగా శ్రీశైలం నియోజకవర్గం సున్నిపెంటలోని సమీకృత గిరిజనాభివృద్ధి కార్యాలయంలో గురువారం నిర్వహించిన టెండర్ పక్రియలో గోల్‌మాల్ జరిగిందని కాంట్రాక్టర్లు ఆరోపించారు. రాష్ట్రంలో ఎక్కడా లేని నిబంధనలు పెట్టి గతంలో సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కే (వైసీపీకి అనుకూలంగా ఉన్న వ్యక్తి) అప్పగించాలనే ఆలోచనతో పీవో శివప్రసాద్ వ్యవహరిస్తున్నారని పలువురు టెండర్‌దారులు ఆరోపిస్తున్నారు. టెండర్లు దాఖలు చేసిన 13మంది కాంట్రాక్టర్లలో 9 మంది కాంట్రాక్టర్లను అనర్హులుగా గుర్తిస్తూ వారి టెండర్లను రద్దుచేశామని అధికారులు తెలిపారు. దీంతో అధికారులు, టెండర్‌దారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం బాధిత కాంట్రాక్టర్లు కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. చివరికి ఐటీడీఏ పీవో స్పందించి తాత్కాలికంగా టెండర్ ఎంపిక పక్రియ వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. ఏది ఏమైనా సదరు టెండర్ పక్రియ వ్యవహారం ఉమ్మడి కర్నూలు, ప్రకాశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

32 రకాల సరుకుల సరఫరాకు టెండర్లు

ఐటీడీఏ అధికారులు గిరిజన హాస్టళ్లకు 32 రకాల నిత్యావసర సరుకులను 2025-26 విద్యా సంవత్సరానికి టెండర్లు పిలిచారు. దీంతో 13 మంది కాంట్రాక్టర్లు రూ.2లక్షల చొప్పున డీడీలు తీసి షీల్డ్ కవర్ టెండర్ వేశారు. దీంతో గురువారం టెండర్లను తెరిచారు. అయితే 9 టెండర్లను నిబంధనల హాల్‌మార్క్, టర్నోవర్ తదితర నిబంధనల పేరుతో పీవో రద్దు చేశారు. మిగిలిన మూడు టెండర్లను అర్హులుగా గుర్తించారు. ఈ ముగ్గురు కూడా గతంలో వైసీపీ హయాంలో సరఫరా చేసిన పల్నాడు జిల్లాకు చెందిన కాంట్రాక్టర్లని సమాచారం. పైగా వారు వైసీపీ అనూకూలంగా వ్యవహరిస్తూ రెండేళ్లలో సక్రమంగా నిత్యావసర వస్తువులు సరఫరా చేయకుండా సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఐటీడీఏ పీవో నిబంధనలను సాకుగా చూపి తమ టెండర్లను రద్దు చేయడం సమంజసం కాదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారుల మతలబు

హాల్‌మార్కు పేరుతో అధికారులు మతలబు చేస్తున్నారు. గతంలో కాంట్రాక్టర్‌పై పలు ఆరోపణలు ఉన్నప్పటికి హాల్‌మార్క్ ఉందని పాత కాంట్రాక్టర్లకే టెండర్లు దక్కేలా అధికారులు వ్యవహరిస్తున్నారు. కలెక్టర్ స్పందించి అర్హులకు టెండర్ దక్కేలా చూడాలి. ● భగవన్ (నెల్లూరు)

ముగ్గురు కాంట్రాక్టర్ల కోసమే

అధికారులు గతంలో నిత్యావసర సరుకులు సరఫరా చేసే పాత కాంట్రాక్టర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులకే ఈ టెండర్ అప్పగించాలని లేనిపోని నిబంధనలు పెట్టారు. రాష్ట్రంలో ఎక్కడా ఈ నిబంధన లేదు. గతంలో ఆరోపణలు ఉన్నప్పటికి పాత కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టలేదు. కావున మంత్రి, కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలి.

● రఘు (మార్కాపురం)

హాల్‌మార్క్ అన్నింటికి ఉండదు

హాల్‌మార్క్ అనేది కందిపప్పు, ఆయిల్, రవ్వలు తదితర వస్తువులకు ఉండదు. పదేళ్లుగా మేమే చేశాం. కానీ మమ్మల్ని తొలగించడం అన్యాయం. ఒకే కుటుంబానికి చెందిన పాత కాంట్రాక్టర్ వ్యూహం ప్రకారం మూడు పేర్ల మీద సదరు టెండర్ దక్కించుకోవాలని చూస్తున్నారు. ఇందుకు అధికారులు కూడా సహకరిస్తున్నారు. ప్రశ్నిస్తే అధికారులు మమ్మల్ని బయటకు వెళ్లాలని హెచ్చరిస్తున్నారు. ఈ టెండర్ పక్రియను రద్దు చేసి అర్హులైన వారికి ఇవ్వాలి.

● వెంకటేశ్వర్లు (నెల్లూరు)


ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

భద్రతకు భరోసా ఏదీ..?


ఆత్మకూరు సమీపంలో ఓవర్‌లోడ్‌తో ప్రమాదానికి గురైన వాహనం.. క్షతగాత్రులు (ఫైల్)

- నెత్తురోడుతున్న రహదారులు
- నిర్లక్ష్యం, అతివేగమే కారకాలు
- రోజురోజుకు పెరుగుతున్న ప్రమాద తీవ్రత
- మారని వాహనచోదకులు
- మూడేళ్లలో 1775 ప్రమాదాలు
- 965మంది మృత్యువాత.. 2329 మందికి గాయాలు
- వేగ నియంత్రణలో విఫలమవుతున్న అధికారులు
- చాలా చోట్ల కానరాని హెచ్చరిక బోర్డులు

రోడ్డు ఎక్కాలంటేనే సగటు మనిషి బెంబేలెత్తిపోతున్నాడు.. మనిషి భద్రతకు భరోసా లేకుండా పోతోంది. మనం అన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఎటునుంచి ఏ వాహనం వచ్చి ఢీకొట్టిపోతుందో అన్న భయం నెలకొంది. రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రహదారులు నెత్తురోడుతున్నాయి. అతివేగం, నిర్లక్ష్యం కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారు. అలాగే పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోవడం కూడా కారణమని చెప్పవచ్చు. ప్రమాదాల్లో గాయపడ్డ వారు దివ్యాంగులుగా మారుతున్నారు. ప్రమాద బాధితుల కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ప్రమాదాలను నియంత్రించాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉన్నారు. అలాగే హైవేలు, రహదారులపై వేగాలను నియంత్రించేందుకు ఏర్పాటుచేయాల్సిన సూచికబోర్డులు కూడా చాలా చోట్ల కనిపించవు.

నంద్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణం సాఫీగా సాగి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలంటే రహదారుల భద్రత కూడా ఎంతో ముఖ్యం. ప్రధానంగా రహదారులు, హైవేపై ప్రమాదాలు జరగకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుంది. కానీ ఎక్కడా కూడా అన్ని చర్యలు కనిపించడం లేదు. దీంతో జిల్లాలో రహదారులు నెత్తు రోడుతున్నాయి. రోజు ఏదో ఒకప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికశాతం ప్రమాదాలు వాహనచోదకుల నిర్లక్ష్యంతోనే జరుగుతున్నాయి. అజాగ్రత, నిబంధనల అతిక్రమణ, మితిమీరిన వేగం, రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలను నిలపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ తదితరాలు ప్రమాదాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. ప్రమాదాలలో వందల సంఖ్యలో మృత్యువాత పడుతుండగా.. వేలాదిమంది క్షతగాత్రులై కాళ్లు చేతులు ఇతర శరీర బాగాలు కోల్పోయి వికలాంగులవుతున్నారు. ఫలితంగా వారి కుటుంబాలు చిన్నభిన్నమవుతున్నాయి. వంద ప్రమాదాల్లో 70శాతం ప్రమాదాలు అతివేగంతో జరిగినవే అని అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదాల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్నా.. అనేకమంది వాహన చోదకుల్లో ఏమాత్రం మార్పు రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ప్రజల్లో భయాందోళన..

జిల్లాలో రోడ్ల ప్రమాదాలు ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్డుపైకి రావాలంటేనే జంకాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. జిల్లాలో మూడేళ్లలో 1775 ప్రమాదాలు జరిగాయి. అందులో 2329 మంది గాయపడగా.. 965మంది మృత్యువాత పడ్డారు. ఇందులో గాయపడిన చాలామంది దివ్యాంగులయ్యారు. రోడ్డు ప్రమాదాలు జరగడానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని చెప్పలేం. గతంలో జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాలు పరిశీలిస్తే.. మొత్తం డ్రైవర్ తప్పిదంతోనే చోటు చేసుకున్నవి కావని పలు కేసుల్లో స్పష్టమైంది. గతంలో రోడ్డు సేఫ్టీ విభాగం ఏర్పాటు చేశారు. జాతీయ రహదారులపై వేగ నియంత్రణ, ప్రమాదాలు నివారణకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఆయితే రోడ్డు సేఫ్టీ విభాగం పనితీరు జిల్లాలో కంటి తుడుపు చర్యలకే పరిమితమైందనే విమర్శలు లేకపోలేదు.


ప్యాపిలి వద్ద బోల్తా పడిన కారు (ఫైల్)

మిగతా 6వ పేజీ

భావి తరాలకు పర్యావరణాన్ని కాపాడాలి

● రాష్ట్ర న్యాయ, మైనార్టీ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడి భావి తరాలకు అందించాలని రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్జీవో కాలనీలోని పురపాలక పాఠశాలలో అటవీశాఖ, పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు కలెక్టర్ రాజాకుమారి, జేసీ విష్ణుచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలను నాటి వాటి బాధ్యతగా తీసుకోవాలని కోరారు. నేటి కాలంలో పర్యావరణానికి హాని కలిగించే ప్లాసిక్ వాడకాన్ని తగ్గించాలని అన్నారు. అనంతరం ప్లాస్టిక్ రహిత బాటిళ్లను పంపిణీ చేశారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఆ తర్వాత కలెక్టర్ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు.. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, జిల్లా డివిజన్ అధికారులు, పురపాలక ఇన్‌చార్జి కమిషనర్ వెంకటదాస్ డీఈవో జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న మంత్రి, కలెక్టర్, జిల్లా అధికారులు

ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ల బదిలీ 6

12న నంద్యాలకు వైఎస్ షర్మిల 7

వేరు శనగ రైతులు దగా

ఈ రైతు పేరు మారెప్ప. క్రిష్ణగిరి మండలంలోని మల్యాలకు చెందిన ఇతడు గత రబీలో గాజులదిన్నె జలాశయం కింద వేరుశనగ పంటను రెండెకరాల్లో సాగు చేశాడు. కర్నూలు మార్కెట్ యార్డుకు రెండు రోజుల క్రితం పంట దిగుబడిని అమ్మేందుకు తెచ్చాడు. వ్యాపారులు కేవలం రూ.6,500 ధర మాత్రమే ఒక క్వింటానికి చెల్లించారు. ప్రస్తుతం ఏపీ సీడ్స్ సంస్థ వేరుశనగ విత్తనకాయలను కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. క్వింటానికి రూ.9,300 చెల్లిస్తామని ప్రకటించింది. ఈ విషయం తెలిసి రైతు ఏపీ సీడ్స్ అధికారులను కలిశాడు. తన వద్ద నాణ్యమైన వేరుశనగ కాయలు ఉన్నాయని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కొనాలని కోరాడు. అయితే.. తాము కొనే అవకాశం లేదని అధికారులు చెప్పడంతో మరో దారి లేక కర్నూలు మార్కెట్ యార్డులోనే విక్రయించాడు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వేరుశనగ రైతులందరి దుస్థితి ఇది.





కర్నూలు అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జూన్ నుంచి మొదలయ్యే ఖరీఫ్‌లో రైతులకు విత్తనం కోసం 40 శాతం సబ్సిడీపై నాణ్యమైన వేరుశనగ కాయలను పంపిణీ చేయాలని ఏపీ సీడ్స్ సంస్థ నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు క్వింటానికి రూ.9,300 చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లాకు 9,099 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 2,009 క్వింటాళ్లు రాయితీపై అందించాలని వ్యవసాయ శాఖ కమిషనర్ అనుమతి ఇచ్చింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రాబోయే ఖరీఫ్‌లో దాదాపు 90వేల హెక్టార్లలో వేరుశనగ పంటను సాగు చేస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఇంత విస్తీర్ణంలో పంట సాగుకు దాదాపు 20వేల నుంచి 30వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతుంది. అయితే ప్రభుత్వం ఎప్పుడూ ఇంత పెద్దమొత్తంలో విత్తనాలను రాయితీపై రైతులకు అందించేందుకు శ్రద్ధ చూపలేదు.

వ్యాపారుల దోపిడీ

గత వైసీపీ ప్రభుత్వంలో రాయితీపై రైతులకు వేరుశనగ కాయలను అందించాలని తీసుకున్న నిర్ణయం అమలు కాలేదు. వాస్తవానికి ఏపీ సీడ్స్ సంస్థ అధికారులే రైతులకు మూల విత్తనాన్ని (ఫౌండేషన్ సీడ్స్) అందించి వారికి సరైన సూచనలు ఇచ్చి విత్తనోత్పత్తి చేయించాలి. ఆ విత్తనాలను ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ విధానానికి తూట్లు పొడిచేశారు. కనీసం మార్కెట్ యార్డుల్లో రైతులు తెచ్చిన నాణ్యమైన వేరుశనగ కాయలను కొనుగోలు చేసి మళ్లీ రైతులకే ఖరీఫ్‌లో రాయితీపై అందించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా, ఆ విధానానికీ స్వస్తి చెప్పేశారు. వ్యాపారులైతే తమకు పెద్దమొత్తంలో కమీషన్లు అందిస్తారనే ఉద్దేశంతో వారికే విత్తన సేకరణ అధికారాన్ని కట్టబెట్టారు. ఇది ప్రభుత్వానికి పెద్దఎత్తున భారం కావడమే కాకుండా రైతులకు కూడా ప్రభుత్వం అందించే 40 శాతం సబ్సిడీ వల్ల ఏ మాత్రం ప్రయోజనం కలగలేదు. వ్యాపారులు

- రాయితీ వేరుశనగ విత్తన సేకరణలో భారీ దోపిడీ
- రైతు నుంచి కాకుండా వ్యాపారుల నుంచే కొనుగోలుకు ఏపీ సీడ్స్ నిర్ణయం
- రైతులకు ఇచ్చేది క్వింటం రూ.6,500
- ఏపీ సీడ్స్ వ్యాపారులకు రూ.9,300
- క్లీనింగ్, రవాణా ఖర్చులు పోను క్వింటంపై వ్యాపారులకు రూ.2వేలు లాభం
- ఉమ్మడి జిల్లాలో 11,108 క్వింటాళ్ల కొనుగోలుకు ఏపీ సీడ్స్ సిద్ధం

ఏపీ సీడ్స్ క్వింటానికి అందిస్తున్న రూ.9,300లో భారీ ఎత్తున మూటగట్టుకునేందుకు నాసిరకం విత్తనాలను సేకరించే కార్యక్రమాన్ని ప్రస్తుతం చేపడుతున్నారు.

మిగతా 6వ పేజీలో

గోవుల అక్రమ రవాణాపై నిఘా

నంద్యాల టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గోవుల అక్రమ రవాణా జరగకుండా నిఘా ఉంచినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్‌లో పోలీసు అధికారులకు నిరంతరం తనిఖీలు చేపట్టాలని సూచించారు. అన్ని పోలీసు స్టేషన్లలోని బక్రీద్ పండుగ సందర్భంగా పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించనట్లు పేర్కొన్నారు. బక్రీద్ పండుగ త్యాగానికి గుర్తుగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఏదైనా సమస్యలు ఉంటే పోలీసులకు ముందుగానే తెలపాలన్నారు.

వేరు శనగ రైతులు దగా

(5వ పేజీ తరువాయి)

కర్నూలు జిల్లాతో పాటు తెలంగాణలోని వనపర్తి, గద్వాల ప్రాంతాల్లో రైతుల నుంచి వేరుశనగ కాయలను క్వింటానికి రూ.6వేల నుంచి రూ.6,500 చెల్లించి నెల కిందటే గోదాముల్లో దాచారు. ప్రస్తుతం ఏపీ సీడ్స్ సంస్థ క్వింటం విత్తనానికి రూ.9,300 ధర చెల్లించేందుకు నిర్ణయించడంతో తమ జేబులు నిండినట్లేనని ఆశ పడుతున్నారు. విత్తనాల క్లీనింగ్, రైతు సలహా కేంద్రాలకే చేర్చేందుకు రవాణా తదితర ఖర్చులన్నీ కలిపి క్వింటానికి రూ.1000 దాకా ఖర్చు వస్తుందని వారు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం చెల్లించే రూ.9,300 ధరతో పోలిస్తే రవాణా ఖర్చులు రైతులకిచ్చే రూ.6500 పోను తమకు ఒక క్వింటంపై రూ.2వేల దాకా మిగులుతుందని ఆశిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు కేటాయించిన 11,108 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాల వల్ల కేవలం ఒక నెలలోనే దాదాపు రూ.2 కోట్లు మిగుల్చుకునే అవకాశం వారికి ఏర్పడింది. రైతులతో కొనుగోలు చేసింటే పెద్ద ఎత్తున ప్రభుత్వానికి విత్తన సేకరణలో భారం తగ్గడమే కాకుండా రైతులకు మంచి ధర చెల్లించే అవకాశం ఉండేది. కూటమి ప్రభుత్వం తమ నుంచి రాయితీ విత్తనాలు కొనుగోలు చేస్తుందని రైతులు ఎంతగానో ఆశించారు అయితే ఏపీ సీడ్స్ సంస్థ రాష్ట్ర అధికారులు తీసుకున్న నిర్ణయం వారిని నిరాశపరిచింది.

రైతుల నుంచి ఎందుకు కొనరు?



గత వైసీపీ ప్రభుత్వం మా పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కనీసం ఈ ప్రభుత్వమైనా రాయితీపై అందించే విత్తనాలను మా నుంచే కొంటుందేమో అని ఆశపడ్డాం. నేను ఏపీ సీడ్స్ అధికారులకు ఫోన్ చేసి వేడుకున్నా. నిబంధనల ప్రకారం రైతుల నుంచి కొనుగోలు చేయడం లేదని సమాధానం ఇచ్చారు. వాస్తవంగా ఏపీ సీడ్స్ అధికారులు మాకు మూల విత్తనాన్ని అందించి, మాచేత నాణ్యమైన విత్తనోత్పత్తి చేయించాలి. వాటిని ఆ సంస్థే కొనాలి. ఆ లక్ష్యానికి ఏపీ సీడ్స్ సంస్థ ఎప్పుడో నీళ్లొదిలింది. మరో దారి లేక నేను మార్కెట్‌యార్డుకు తీసుకువచ్చి తక్కువ ధరకే వేరుశనగ కాయలను వ్యాపారుల చేతుల్లో పెట్టాను.

- లక్ష్మీనారాయణ, మన్నెకుంట

నిబంధనల ప్రకారమే కొంటున్నాం



నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆదేశాలపై ఆర్గనైజర్ల నుంచి వేరుశనగ విత్తనాలను సేకరిస్తున్నాం. విత్తనాల క్లీనింగ్, రవాణా ఖర్చులు మొదలైన వాటిని పరిశీలించి ప్రభుత్వం ప్రతి సంవత్సరం సేకరణ ధరను నిర్ణయిస్తుంది. ఎవరైనా వ్యాపారులు నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

- ధనలక్ష్మి, ఏపీ సీడ్స్ మేనేజర్

ప్రభుత్వ బడికి రండి..!

- ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి
- అడ్మిషన్ల కోసం ప్రత్యేక డ్రైవ్
- తల్లిదండ్రులను కలుస్తున్న ఉపాధ్యాయులు
- గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



బడిబయట పిల్లలు బడిలో చేర్పించేందుకు అవగాహన ర్యాలీ చేస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

చాగలమర్రి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోంది. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అడ్మిషన్ల డ్రైవ్ కొనసాగుతోంది. సమగ్రశిక్ష అధికారులు, సీఆర్పీలు, ఐఈఆర్పీలు, ఉపాధ్యాయులు బృం దాలుగా ఏర్పడి బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండే చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తు న్నారు. ఇంటింటికి వెళ్లి ఎన్‌రోల్‌మెంట్ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలంటూ తల్లిదండ్రులను కోరుతున్నారు. గిరిజన ప్రాంతాలతో పాటు ఆయా గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఉపాధి పనులు చేసే కూలీల వద్దకు వెళ్లి ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పథకాలను వివరిస్తున్నారు. గ్రామాల్లో ర్యాలీల ద్వార అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటూ ప్రచారం నిర్వహిస్తున్నారు. 117 జీవో రద్దుతో పాటు మోడల్ పాఠశాలల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధంచేసింది. పంచాయతీకి ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటుచేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియామించనుంది. పాఠశాలల సర్దుబాటు, విలీనప్రక్రియ, ఉపాధ్యాయుల కేటాయింపులో తప్పులను సరిదిద్దనుంది.

యూనిఫామ్, బ్యాగుల్లో మార్పు



'మనబడి-మన భవిష్యత్తు' పథకం ద్వారా సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో బ్యాగులను ముద్రించి జిల్లాలోని ఆయా పాఠశాలలకు సరఫరా చేసింది. జిల్లాలో 1,959 పాఠశాలలకు 1 నుంచి 10 వరకు చదివే విద్యార్థులకు కొత్తగా మూడు జతల యూనిఫారాలను పంపిణీ చేసేందుకు సిద్ధంచేసింది. ఆయా మండల కేంద్రాలకు వాటిని సరఫరా చేశారు. బడి తెరిచే నాటికి విద్యార్థులకు కిట్ల రూపంలో పంపిణీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు.

వైసీపీ హయాంలో 117 జీవో ద్వారా..

నంద్యాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,959 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో 3.63 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆళ్లగడ్డ డివిజన్ పరిధిలో చాగలమర్రిలో 8,744 మంది విద్యార్థులు, ఆళ్లగడ్డలో 15,922, దొర్నిపాడు 2,519, శిరివెళ్ల 8,122, రుద్రవరం 5,748, ఉయ్యాలవాడ 2,231మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులు లేరన్న సాకు చూపి వైసీపీ ప్రభుత్వ హయాంలో 117జీవో ద్వారా విద్యార్థులు లేని పాఠశాలలను సమీప స్కూళ్లలో విలీనం చేశారు. జిల్లాలో 10 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు అధికంగా ఉన్నాయి. విలీనం నేపథ్యంలో 3వ తరగతికి వస్తే మరో పాఠశాలలో చేర్చాల్సి ఉండటంతో తల్లిదండ్రులు కూడా పెద్ద ఆసక్తి చూపలేదు. ప్రైవేటు బడుల వైపు మొగ్గు చూపారు. ఫలి తంగా ప్రభుత్వ పాఠశాలలు ఖాళీగా కనిపించాయి. ఇన్ని సమస్యలు ఉంచుకొని పాఠశా లల స్వరూపానే మార్చేశామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. నాడు-నేడు పథకంతో పాఠశాల భవనాలను నిర్మించినట్లు, ఫర్నిచర్, ఇతరత్రా సదుపాయాలు కల్పించినట్లు చెప్పింది. ఇలా పనులు చేపట్టిన వందలాది పాఠశాల భవనాలు వృథాగా, అసంపూర్తిగా ఉన్నాయి.

స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత..

స్కూల్ కాంప్లెక్స్‌లను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌లో 50మంది ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు చేపట్టనుంది. ఇప్పటి వరకు ప్రతి మండలంలో 5 నుంచి 10వరకు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉండేవి. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వాటి సంఖ్య తగ్గే అవకాశం ఉంది. నిర్దేశిత సంఖ్యలో ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు హాజరైతే బోధన, ఇతరత్రా అంశాలపై ఉపాధ్యాయులకు మరింత అవగాహన పెరిగే అవకాశం ఉంది. గత ఐదేళ్లలో స్కూల్ కాంప్లెక్స్ మావేశాలు తూతూ మంత్రంగా జరిగాయి. పాఠశాలలపై అధికారులు, హెచ్‌ఎంల పర్యవేక్షణ కూడా తగ్గడంతో విద్యాబోధన, పరీక్షా ఫలితాలపై ప్రభావం చూపింది. అందుకే తిరిగి హెచ్‌ఎంలకే పర్య వేక్షణ బాధ్యతలు అప్పగించనుంది. మండలానికి ఒక ఎంఈవోను పరిమితం చేయనుంది.

విద్యార్థుల కోసమే స్పెషల్‌డ్రైవ్



బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సం ఖ్య పెంచేందుకు స్పెషల్‌డ్రైవ్ చేపట్టాం. వేసవిసెలవుల ప్రారంభానికి ముందుగానే ఎన్ రోల్‌మెంట్ సర్వే చేస్తున్నాం. సమగ్రశిక్షణ అధికారులు, సీఆర్పీలు, కస్తూర్బా, విద్యాశాఖ సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని చేపడుతున్నారు. తల్లిదండ్రుల నుంచి సానుకూలతలు వస్తున్నాయి.

- న్యామతుల్ల, ఎంఈవో, చాగలమర్రి



ఎన్‌రోల్‌మెంట్ సర్వే చేస్తున్న కస్తూర్బా ఉపాధ్యాయినీలు

పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ ఏజెంట్ల దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు న్యూసిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు డివిజన్ పరిధిలోని తపాలా శాఖలో తపాలా జీవిత బీమా(పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా(ఆర్‌పీఎల్ఐ) ఏజెంట్లుగా కమీషన్ ప్రాతిపదికన పనిచేయడానికి దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండి పదో తరగతి ఆపైన పాసైన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 23 నుంచి 27 తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పాత బస్టాండు ప్రధాన తపాలా కార్యాల యంలో నేరుగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలి పారు. ఎంపిక చేసిన ఏజెంట్లు సెక్యూ రిటీ డిపాజిట్ రూ.5 వేలు ఎన్ఎస్‌సీ /కేవీపీ రూపంలో(రీఫండబుల్) చెల్లించాలన్నారు. వివరాలకు డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఫోన్ 7013029312లో సంప్ర దించాలన్నారు.

ఆర్ఐవోగా సురేష్‌బాబు

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా ఆర్ఐవోగా సి.సురేష్‌బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా వృత్తివిద్యాధికారిగా కొనసాగుతున్న ఆయన్ను తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఐవోగా నియమించింది. దీంతో ఈ స్థానంలో పనిచేస్తున్న ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టిని విధుల నుంచి తప్పించి ఓర్వకల్లు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేలా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృతిక శుక్ల ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సురేష్‌బాబు మాట్లాడుతూ జిల్లాలోని ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాధ్యతలు చేపట్టిన సురేష్ బాబును కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.లాలెప్ప, సుంకన్న, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు చేపట్టిన సి.సురేష్‌బాబు

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్
- మత సామరస్య కమిటీ సమావేశం

ఆదోని , జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగను మత సామరస్యంతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో అన్నిమతాల పెద్దలతో మత సామరస్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మా ట్లాడుతూ ఆదోని మత సామరస్యానికి ప్రతీక అని, అందరి సహకారంతో ఇది సాధ్య మైందని, ఈసహకారాన్ని ఇలాగే కొనసాగించాలన్నారు. బక్రీద్ పండుగను ఎవరికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సంతోషంగా జరుపుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలపై అప్రమత్తంగా ఉండాలని, ఏ చిన్న సున్నితమైన సమస్య వచ్చినా వెంటనే పోలీస్, రెవెన్యూ శాఖలకు తెలియజేయాలని సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, మునిసిపల్ కమిషనర్ కృష్ణ, తహసీల్దార్ శివరాముడు, పీస్ కమిటీ సభ్యులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, ఎగ్గాటి ప్రతాప్, సాదీ రావుఫ్, మత పెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

రామలింగేశ్వరుని సన్నిధిలో హైకోర్టు జడ్జి



హైకోర్టు జడ్జి హరిహరనాథశర్మకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

పత్తికొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి హరి హరనాథశర్మ గురువారం పత్తికొండ మండలంలోని మండగిరి గ్రామంలో పురాతన రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగ తం పలికారు. పత్తికొండ సీనియర్ న్యాయవాదులు చంద్రశేఖర్‌నాయుడు, యల్లారెడ్డి, సత్యనారాయణ, శశికళ, క్రిష్ణ, జూనియర్ న్యాయవాది బత్తిని అరుణ్‌కుమార్ ఆయనతోపాటు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకాన్ని అందరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని కలెక్టర్ పి.రం జిత్ బాషా అన్నారు. గురువారం గార్గేయపురం నగరవనంలో వన మహోత్సం-2025లో భాగంగా మొక్కలను నాటారు. కాలుష్యాన్ని అరి కట్టాలంటే మొక్కల పెంపకం ఒక్కటే మార్గమన్నారు. పత్తికొండ శాసన సభ్యుడు కేఈ శ్యాంకుమార్ మాట్లాడుతూ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమల పరిధిలో మొక్కలు నాటాలని తెలిపారు. అనంతరం నగరవనంలో చిన్న పిల్లల పార్కును ప్రారంభించారు. కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, డీఎఫ్‌వో శ్యామల, ఫ్లయింగ్ స్క్వాడ్ రవిశంకర్, నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ ఛైర్మన్‌గా విష్ణువర్ధన్ రెడ్డి

నేడు ప్రమాణ స్వీకారోత్సవం



కర్నూలు అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్‌గా ఎదురూరు విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం ప్రమా ణ స్వీకారం చేస్తారని సీఈవో రామాంజనేయులు గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో తహసీల్దార్ల బదిలీ

నంద్యాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పలువురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ కర్నూలు కలెక్టర్ రంజిత్ బాషా గురువారం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల కలెక్టరేట్‌లో ఏవోగా పనిచేస్తున్న డి.రవికుమార్‌ను కర్నూలుకు, అక్కడ పనిచేస్తున్న ఏవో ఐ.విజయశ్రీని నంద్యాలకు బదిలీ చేశారు. బేతంచెర్ల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్.ప్రకాష్‌బాబు, డోన్ డిప్యూటీ తహసీల్దార్ కె.పురుషోత్తంను కర్నూలు జిల్లాకు కేటాయించారు. కర్నూలు అర్బన్ డీటీగా పనిచేస్తున్న వి.గిరి కుమార్‌రెడ్డిని నంద్యాల జిల్లాకు కేటాయించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో బదిలీ అయిన తహసీల్దార్ల వివరాలు ఇలా...

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
శివరాముడు	ఆదోని	కలెక్టరేట్, కర్నూలు
సీహెచ్.ఇంద్రాణి	కలెక్టరేట్, కర్నూలు	సూపరింటెండెంట్, కలెక్టరేట్
గోవింద్ సింగ్	ఆలూరు	ల్యాండ్ విభాగం, కలెక్టరేట్
నజ్మాభాను	హాలహర్వి	కేఆర్ఆర్‌సీ, కలెక్టరేట్
శ్రీనాథ్	పెద్దకడబూరు	ఎల్ఆర్ విభాగం, కలెక్టరేట్
కుమారస్వామి	గోనెగండ్ల	కేఆర్‌సీసీ, ఆర్డీఓ, కర్నూలు
రాజేశ్వరి	కలెక్టరేట్, కర్నూలు	గోనెగండ్ల
రమాదేవి	తుగ్గలి	మంత్రాలయం
ఎం.ఏ.రమేష్	పత్తికొండ	ఆదోని
రవికుమార్	ఏఓ, నంద్యాల	కర్నూలు అర్బన్
వెంకటేష్ నాయక్	కోడుమూరు	గూడూరు
వెంకటలక్ష్మి	కర్నూలు అర్బన్	సీ.బెళగల్
హుసేన్ సాహెబ్	మద్దికెర	పత్తికొండ
ప్రకాష్ బాబు	బేతంచెర్ల	కృష్ణగిరి
ఎస్.రవి	మంత్రాలయం	తుగ్గలి
రామాంజనేయులు	గూడూరు	దేవనకొండ
వేణుగోపాల్	కలెక్టరేట్, కర్నూలు	కోసిగి
కె.పురుశోత్తం	నంద్యాల జిల్లా	కర్నూలు జిల్లా

మొక్కజొన్న ధర పతనం..

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఎంతో ఆశతో గిట్టు బాటు ధర వస్తుందని వివిధ ప్రాంతాల నుంచి రైతులు మార్కెట్ యార్డుకు మొక్కజొన్నలను అమ్మకానికి తీసుకువచ్చారు. అయితే.. కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలను తగ్గించడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డుకు 59 క్వింటాళ్ల మొక్కజొన్నలను రైతులు అమ్మకానికి తెచ్చారు. ప్రభుత్వం క్వింటం మొక్కజొన్నలకు 2,225లు మద్దతు ధరగా ప్రకటించింది. అయితే వ్యాపారులు కూడబలుక్కొని ఈ మద్దతు ధరను రైతులకు అందకుండా చేశారు. గరిష్ఠ ధర కేవలం రూ.2,069, మధ్యస్థ ధర రూ.2,063, కనిష్ఠ ధర రూ.1,869 మాత్రమే దక్కడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగో పట్టణ సీఐగా విక్రమసింహ

కర్నూలు క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ సీఐగా విక్రమసింహ గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2004 బ్యాచ్‌కు చెందిన ఈయన చిత్తూరు జిల్లాలో పని చేశారు. 2013లో సీఐగా పదో న్నతి పొంది, సీఐడీ, పత్తికొండ, డీసీఆర్‌బీ, కర్నూలు వన్‌టౌన్, సిరివెళ్ల, కర్నూలు తాలుకా, ఆదోని వన్‌టౌన్, దిశా తదితర పోలీస్ స్టేషన్‌లలో పని చేశారు. కొద్ది రోజుల కింద ఎమ్మిగనూరు రూరల్ సర్కిల్ పని చేస్తూ వీఆర్‌కు వచ్చారు. వీఆర్‌లో ఉన్న ఆయన్ను నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.



బాధ్యతలు స్వీకరించిన సీఐ విక్రమసింహ

పర్యావరణం కోసం మొక్కలను నాటాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్థి



జిల్లా కోర్టు ఆవరణంలో మొక్కను నాటుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూలు లీగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా ప్రధాన న్యాయాధి కారి జి.కబర్ధి కోరారు. ప్రపంచ పర్యావరణ దినో త్సవం సంద ర్భంగా గురు వారం స్థానిక జిల్లా కోర్టు ఆవర ణంలో ఆయన మొక్కలను నాటి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణంలో మొ క్కలను నాటడమే కాకుండా వాటిని పరిరక్షించుకోవా ల్సిన బాధ్యత కూడా ఉందని తెలిపారు. బాలబాలికలు విద్యార్థి దశలోనే పర్యావరణంపై అవగాహన పెంచుకునేం దుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో 6వ అదనపు జిల్లా న్యాయాధికారి వాసు, న్యాయ సేవాధికా రసంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్ ఎం.వెంకట హరినాథ్, కర్నూలు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టెలికాం నగర్‌లో చైన్ స్నాచింగ్

కర్నూలు క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని టెలికాం నగర్‌లో గురువారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరి గింది. సుంకులమ్మ అనే వృద్ధురాలు టైలర్ షాపు నుంచి తన ఇంటికి నడు చుకుంటూ వెళ్తుండగా.. బైక్‌పై ఇద్దరు ఆగంతకులు వచ్చి ఆమె మెడ లోని గొలుసును తెంపుకుని ఉడాయించారు. వృద్ధురాలు కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. అపహరణకు గురైన గొలుసు విలువ 3తులాలు ఉంటుందని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీ సులు సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు.

భద్రతకు భరోసా ఏదీ?

5వ పేజీ తరువాయి

పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులకు ఎక్కించుకోవడంతో ప్రయాణించడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రధా నంగా ఆటోలు, బస్సులు, రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులను తరలిస్తు న్నారు. ఆటోల్లో అయితే మరీ దారుణం. డ్రైవర్ పక్కనే నలుగురిని ఎక్కించుకుని ప్రయాణిస్తున్నారు. దీంతో డ్రైవర్ స్టీరింగ్ తిప్పే పరిస్థితి లేదు. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.


ప్రమాదాలకు కారణాలు ఇవే..

మితిమీరిన వేగం, మద్యం, నిద్రమత్తు, ఓవర్ టెక్, ఆకస్మాత్తుగా వాహనాన్ని నిలపడం, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమణ, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అస్తవ్యస్తంగా పలు రహదారులు ప్రమాదాలకు కారణంగా నిలుస్తున్నాయని తెలుస్తోంది. ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలే ప్రమా దాలకు గురైనట్లు జిల్లా పోలీసు యంత్రాంగం పేర్కొంటోంది.

ప్రమాదాలను నియంత్రించలేకపోయాయి..

పోలీసు, ఆర్టీఏ, ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవేస్ శాఖలు ఆశించిన స్థాయిలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించలేకపోయాయన్న విమర్శలు లేకపోలేదు. జిల్లాలోని పలు ప్రధాన. జాతీయ రహదారులపై వేగనియం త్రణలో విఫలమవుతున్నారు. ఎస్పీ, ఆర్టీఏ శాఖల ఉన్నతాధికారులు ఎన్ని ఆదేశాలు జారీచేసినా. క్షేత్రస్థాయిలో నామమాత్రపు తనిఖీ లతో మమ అని పించేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కేవలం జరిమానాలు, కేసులు నమో దుకే పరిమితమవుతున్నారు. దీంతో తరచూ రోడ్డుప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా జాతీయ రహదారిపై అతివేగంతో వాహనాలు ప్రయాణిస్తున్నా. వాటిని ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కనీసం హైవేల్లో మలుపులు, ప్రమాదకర ప్రాంతాల్లో తగిన సూచికబోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

మానవ తప్పిదంతోనే ప్రమాదం



డ్రైవింగ్ చేసే సమయంలో మానవ తప్పి దాలతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగు తున్నాయి. ఓవర్ లోడుతో పాటు అతివే గంతో వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనలను ఏమాత్రం పాటించడం లేదు. శాఖల పరంగా సమష్టిగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేస్తున్నాం.

-శ్రీకాంత్, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, నంద్యాల

ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



రహదారులపై అతివేగంతో ప్రయా ణించి అనేకమంది ప్రాణాలు కోల్పోతు న్నారు. మద్యం సేవించడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదకరం. హెల్మెట్ వాడకం, సీట్ బెల్ట్ ధరించిన సమయంలో ప్రమాదం జరిగినా ప్రాణాలకు కొంతవరకు ముప్పు తగ్గే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

-అధిరాజ్ సింగ్ రాణా, ఎస్పీ, నంద్యాల

ఆటోను ఢీకొన్న కర్ణాటక బస్సు

● ఒకరికి తీవ్ర గాయాలు



నుజ్జు అయిన ఆటో

ఆదోని రూరల్, జూన్ 5 ఆంధ్రజ్యోతి) : ఓ ఆటోను కర్ణాటకకు చెందిన బస్సు ఢీకొనడంతో ఒకరి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని ఆరేకల్ సమీపంలో గురువారం చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. వివరాలు.. గ్రామ సమీపంలో వెళ్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న కర్ణాటక బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నరసింహులుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను స్థానికులు పట్టుకొని తాలుకా పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బెట్టింగ్ రాయుళ్లు అరెస్టు

● 4 సెల్‌ఫోన్లు, రూ.3.40లక్షల నగదు స్వాధీనం
● ఇన్‌చార్జ్ సీఐ మన్సూరుద్దీన్ వెల్లడి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ సీఐ మన్సూరుద్దీన్

కోడుమూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జ్ సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ జరుగుతున్న సమయంలో శ్రీరామచంద్ర టాకీస్ దగ్గర నలుగురు వ్యక్తులు బెట్టింగ్ ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. వెంటనే ఎస్ఐ డి.వై స్వామి, ఏఎస్ఐ శంకర్‌నాయక్, హెడ్‌కానిస్టేబుల్ మద్దీశ్వర్, మహబుబ్‌బాషా, మురారి, కానిస్టేబుల్ జగదీష్, విజయ్‌కుమార్, భాస్కర్, ఓంకార్ మరి కొంత మంది హోంగార్డులు దాడులు చేశారు. కోడుమూరు పట్టణానికి చెందిన గుజరాతి వినోద్ కుమార్, మాదుగుండు వేణుగోపాల్, సోమశేఖర్, పాలవారి భాస్కర్‌రెడ్డి సెల్‌ఫోన్లలో బెంగుళూరు, పంజాబ్ మ్యాచ్‌ను వీక్షిస్తూ బెట్టింగ్‌కు పాల్పడుతుండగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుల నుంచి 4సెల్‌ఫోన్లు, రూ.3.40లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. పట్టుబడిన బెట్టింగ్ రాయుళ్లను కోర్టులో హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. బెట్టింగ్ రాయుళ్లను పట్టుకొన్న ఎస్ఐ డి.వై స్వామి, సిబ్బందిని సీఐ అభినందించారు.

వైసీపీ ఉన్మాదులను ప్రజలు తిరస్కరించారు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు, అర్బన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వైసీపీలోని నియంతలు, ఉన్మాదులను ప్రజలు తిరస్కరించారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి ధ్వజమెత్తారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన రోజుగా జూన్ 4 మిగిలిపోతుందన్నారు. పౌరులు స్వేచ్ఛ పొందిన రోజని అన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యామ్ బాబు మాట్లాడుతూ ఎన్నికల్లో తమకు ఓటేయలేదని ప్రజలే వెన్నుపోటు పొడిచారంటూ వైసీపీ వారు కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ వెన్నుపోటు వైసీపి పార్టీకే వర్తిస్తుందని అన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి జైలుకు వెళ్తాడనే భయంతో ఉనికి చాటుకునేందుకు వైసీపీ వెన్నుపోటు కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ సమావేశంలో నాయకులు కేవీ సుబ్బారెడ్డి, మాల కార్పొరేషన్ డైరెక్టర్ పోతురాజు రవికుమార్, చంద్రకాంత్, పుల్లయ్య, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

12న నంద్యాలకు వైఎస్ షర్మిల

● డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 12వ తేదీన నంద్యాలకు వస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ తెలిపారు. గురువారం నంద్యాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ చాకలి పుల్లయ్య అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలతో షర్మిల సమావేశం నిర్వహిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఎండగట్టడానికి వైఎస్ షర్మిల జిల్లా పర్యటనకు వస్తున్నట్లు తెఇపారు. నాయకులు, కార్యకర్తలు, అన్నివర్గాల ప్రజలు పర్యటనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి రియాజ్, ఆర్గనైజర్ రజాక్‌వలి తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా పఠాన్ సలీం

డీసీసీ ఉపాధ్యక్షుడిగా పఠాన్ సలీంను ఎన్నుకున్నట్లు డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ తెలిపారు. పట్టణ అధ్యక్షుడిగా ఉన్న సలీంను డీసీసీ ఉపాధ్యక్షుడిగా, దాసరి చింతలయ్యను పట్టణ అధ్యక్షుడిగా నియమించామన్నారు.

రైతులను కష్టాల నుంచి గట్టెక్కిస్తాం

● సంఘాల బలోపేతమే డీసీసీబీ లక్ష్యం



మొక్కను నాటుతున్న సీఈవో

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కష్టాల్లో ఉన్న రైతులను వాణిజ్య బ్యాంకుల కంటే ఎక్కువ స్థాయిలో ఆదుకునేందుకు అనేక పథకాలు, కార్యక్రమాలను జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అమలు చేస్తుందని సీఈవో రామాంజనేయులు అన్నారు. గురువారం పర్యావరణ పరిరక్షణలో దినోత్సవంలో భాగంగా కల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సీఈవో రామాంజనేయులు ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక సహాయ సహకారాలతో పాటు డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో బ్యాంకుతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బలోపేతం చేస్తామని సీఈవో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సంఘం పర్సన్ ఇన్‌చార్జి నాగరమణయ్య, కృష్ణానగర్ డీసీసీబీ మేనేజర్ రమాదేవి పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంట్లో నాసిరకం పత్తి విత్తనాలు స్వాధీనం



నకిలీ పత్తి విత్తనాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

మంత్రాలయం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి):మంత్రాలయం మండలం మాజీ జడ్పీటీసీ ఆర్. లక్ష్మయ్య ఇంట్లో భారీగా నాసిరకం పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. గురువారం కర్నూలు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి విశ్వనాథ్, భరత్ మాజీ జడ్పీటీసీ ఇంట్లో సోదాలు చేసి నాలుగు బస్తాల్లో ఉన్న నాసిరకం పత్తి విత్తనాలను పట్టుకున్నారు. దాదాపు వీటి విలువ రూ.1.65 లక్షలు ఉండవచ్చని అంచనా వేశారు. స్థానిక మండల ఏవో జీర గణేష్, వీఆర్వో ప్రభాకర్, వీఆర్ఏ ఈరన్న పంచనామా చేశారు. అధికార పార్టీ నాయకుడి ఇంట్లో భారీగా లూజు నాసిరకం పత్తి విత్తనాలు లభ్యమైన ఘటనలో నియోజకవర్గ స్థాయి నాయకుల ఒత్తిడితో కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారు. లక్ష్మయ్య ఇంట్లో ఉన్న పత్తి విత్తనాలు ఆయన అన్న గోపాల్ కుమారుడు నాగమల్లేష్ పేరుతో ఉన్నట్లు కేసు నమోదు చేశారు. మూడు నిండు బస్తాలు, ఒక సగం బస్తాల్లోని 165 కేజీల నాసిరకం పత్తి విత్తనాలు మార్కెట్‌లో దాదాపు రూ.3 లక్షల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. రైతు తాను పండించిన విత్తనాలను కంపెనీలకు విక్రయించి కొంత విత్తనాలు స్థానిక రైతులకు విత్తనాలు కోరడంతోనే ఇంట్లో నిల్వ ఉంచి రైతులకు స్వచ్ఛందంగా అందిస్తున్నామని రైతు నాగమల్లేష్ పేర్కొంటున్నారు. ఈ పట్టుబడిన విత్తనాలు నకిలీవా..? అసలైన విత్తనాలా? అనేదానిపై ల్యాబ్‌కు పంపించి నిర్ధారణ చేస్తామని విజిలెన్స్ అధికారి విశ్వనాథ్, మండల ఏవో జీర గణేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు లైసెన్సు విత్తనాలు అందించేందుకు ప్రోత్సహిస్తుండగా.. అధికార పార్టీకి చెందిన నాయకుడే నాసిరకం విత్తనాలు తన ఇంట్లో పెట్టుకుని విక్రయిస్తుండటం నియోజకవర్గంలోనే చర్చనీయంశంగా మారింది. 165 కేజీల విత్తనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో వీఏ ఏలు మదార్, దినేష్ ఉన్నారు.







పర్యావరణాన్ని కాపాడుకుందాం

● మొక్కలు నాటి, నీరు పోసిన ప్రజాప్రతినిధులు, అధికారులు ● ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం



నంద్యాలలో మొక్క నాటుతున్న ఏఎస్పీ యుగంధర్‌బాబు



పాణ్యంలో మొక్కకు నీళ్లు పోస్తున్న డీపీవో శివారెడ్డి



ఆత్మకూరు: ప్రతిజ్ఞ చేస్తున్న అటవీశాఖ ఉద్యోగులు



నందికొట్కూరులో మొక్క నాటుతున్న అధికారులు

నంద్యాల టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఎంటీ సీఐ సురేశ్‌బాబు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

● పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పురపాలక సంఘం ఇన్‌చార్జి కమిషనర్ వెంకటదాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఇండోర్ స్టేడియంలో మొక్కలను నాటారు. గనుల శాఖ సహాయ సంచాలకులు, పొల్యూషన్ ఇంజనీర్, జేఎస్‌డబ్ల్యూ, ఎస్పీవై ఆగ్రో, ప్రైవేటు ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

● నంద్యాలలోని బాలాజీ కాంప్లెక్స్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బింగుమళ్ల శ్యాం సుందర్‌గుప్తా మొక్కలు నాటారు. సచివాలయ సిబ్బంది, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్: నంద్యాల పింగళిసూరన స్మారక శాఖ గ్రంథాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ ఇన్‌చార్జి శ్రీధర్, పాఠకులు కలిసి గ్రంథాలయ ఆవరణలో పూలమొక్కలు నాటారు. పీఆర్ విశ్రాంత ఉద్యోగి నరేంద్రనాద్ శర్మ పాల్గొన్నారు.

● శ్రీశైల క్షేత్రంలో మొక్కలు నాటారు. ఏనుగుల చెరువుకట్ట వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కార్యనిర్వహణాధికారి రమణమ్మ, పర్యవేక్షకులు గిరిజామణి, డీఈఈలు చంద్రశేఖరశాస్త్రి, సుబ్బారెడ్డి, ఉద్యానవన అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల హాస్పిటల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్‌సీసీ బాలికలు ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛభారత్, పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటే కార్యక్రమాన్ని దాదాపు 150మంది ఎన్‌సీసీ కేడెట్లు చేపట్టారు. రామకృష్ణ పీజీ కళాశాల నుంచి స్టేట్‌బ్యాంక్ కాలనీలోని చిన్నచెరువు వరకు ర్యాలీ చేసిన అనంతరం వాకర్స్ ట్రాక్‌పై పర్యావరణం చెట్ల పెంపకంపై లఘునాటిక ప్రదర్శించారు. కల్నల్ జోబి ఫిలిప్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శంకర్‌నాయక్, బింగుమళ్ల శ్యాంసుందర్, అలాగే రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా పంచాయతీ అధికారి శివారెడ్డి అన్నారు. పాణ్యంలో మొక్కటు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందిరానగర్‌లో హౌసింగ్ డీఈ సత్యనారాయణమూర్తి చెంచులు కొత్తగా నిర్మించుకున్న ఇళ్ల వద్ద మొక్కలు నాటారు. ఆర్జీఎం, శాంతిరాం, ఫార్మసీ కళాశాలల వద్ద ప్రిన్సిపాళ్లు డాక్టర్ జయచంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సత్యప్రకాష్ మొక్కలు నాటారు. మండలంలోని 19 గ్రామాలలోని ప్రతి పంచాయతీలో 200 మొక్కలు నాటినట్లు డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళీశ్వరగౌడ్ తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచ్ పల్లవి, ఉపసర్పంచ్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంపీటీసీ రంగరమేష్, పంచాయతీ కార్యదర్శి ఆనందరావు, పీఆర్‌ఏఈ మహబూబ్‌బాషా, సచివాలయం కార్యదర్శి శివ, మాజీ జడ్పీటీసీ నారాయణమ్మ, టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, రమణమూర్తి, ప్రభాకర్, సుబ్బయ్య, కుమార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పంచాయతీలలో మొక్కలను నాటారు.

ఆత్మకూరు: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించుకునేందుకు ప్రతిఒక్కరు చైతన్యవంతులు కావాలని ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగలూటి రేంజ్ పరిధిలోని బైర్లూటి ఏకోటూరిజంకు వెళ్లే రహదారికి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారికి ఇరువైపుల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేశారు. సబ్ డిఎఫ్‌వో అబ్దుల్ రవూఫ్, బైర్లూటి రేంజ్ అధికారి కృష్ణప్రసాద్, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

● ఆత్మకూరులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రబాబు, వేణుగోపాల్, నంద్యాల రస్తాలో శ్రీశైలం నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ మోమిన్ షబాన, ఆత్మకూరు ముస్లిం స్మశాన వాటిక నందు ఏడీఏ ఆంజనేయులు, ఏవో విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ.రషీద్, ఇళ్లస్థలాల లేఔట్లలో హౌసింగ్ ఏఈ ఉమామహేశ్వరరెడ్డి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు.

ఆత్మకూరురూరల్: కరివేన గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. టీడీపీ నాయకులు శివశంకరశర్మ, శరత్, శేషన్న, ఓబులేసు,ఈశ్వరయ్య, విద్యా కమిటీ చైర్మన్ బుజ్జి, ఎఫ్ఏ రామకృష్ణ ,ఉపాధిహామి సిబ్బంది పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మండలంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎంపీడీవో దస్తగిరి, తెలుగు గంగ ప్రాజెక్టు కమిటీ జిల్లా వైస్ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, డాక్టర్ భరద్వాజ శర్మ, ఏపీవో వసుధ, ప్రిన్సిపాల్ రఫిక్, యూనిట్ ఇన్‌చార్జి చిన్నలింగారెడ్డి, జాకీర్, మధురెడ్డి, బాలుడు, వెంకటత్రామయ్య, డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహానంది: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చెయ్యాలని మహానంది ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురష్కరించుకొని మహానంది మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, కూటమి ప్రభుత్వ నాయకులు పాల్గొని మెక్కలు నాటారు. తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో మహమ్మద్ దౌలా, డీఆర్వో హైమవతి, ఏఈవో యర్రమల్ల మధు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ప్రతాప్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.

వెలుగోడు: వెలుగోడులోని మోడల్ స్కూల్, కేజీబీవీలో అధికారులు, కూటమి నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ శ్రీనివాసగౌడ్, ఎంపీడీవో మధుసూధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు అన్నారపు సీతమ్మ, ఎల్లా కృష్ణుడు, అన్నారపు శేషిరెడ్డి, మొమిన్‌రసూల్, వీరభద్రుడు, ఖలీల్, జాకీర్‌హుస్సేన్, జనసేన నాయకులు శాలుబాషా ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: మున్సిపాల్టీ పరిధిలో మొక్కలు నాటి పర్యావరణ పరక్షణకు నాంది పలుకుదామని మున్సిపల్ కమిషనర్ బేబి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. టీడీపీ నాయకుడు ఆర్బ శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడు ఎంపీడీవో కార్యాలయం వద్ద, ఇస్కాల, తదితర గ్రామాలలో మొక్కలను నాటారు. మండల ప్రత్యేక అధికారి రాజు, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు. వేంపెంట గ్రామంలో సర్పంచ్ మాణిక్యమ్మ, టీడీపీ నాయకులు టేకూరి నాగేశ్వరరావు, లక్ష్మీకాంతరెడ్డి, లెనిన్‌బాబు, మోహన్‌గౌడ్ పాల్గొన్నారు. ఉపాధి హామీ ఏపీవో అలివేలు మంగమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపల్లి: మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరూ తీసుకోవాలని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. గురువారం ఆయన కొత్తపల్లి మండలంలోని దుద్యాల గ్రామ సచివాలయ ఆవరణంలో ఎంపీడీవో మేరీ, ఏపీవో విమలమ్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యావరణ పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి గౌడు, మల్లారెడ్డి, వైస్ సర్పంచ్ మన్సూర్‌వలి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, వీఆర్వో లింగస్వామి, పంచాయతీ కార్యదర్శి అనూష పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మొక్కలు పెంచి పర్యావరణాన్ని పెంచడం అందరి బాధ్యత అని డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుని జూపాడుబంగ్లాలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. మండలంలోని పారుమంచాల గ్రామంలో మండల ఏపీఎం అంబమ్మ ఆధ్వర్యంలో వెలుగు, రైతు ఉత్పత్తిదారుల కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. పోతులపాడు గ్రామంలో సర్పంచి నిర్మలమ్మ ఆధ్వర్యంలో గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీవో గోపికృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఏపీవో రేష్మా, పీఆర్‌ఏఈ బషీర్, డీటీ నాగన్న, సిబ్బంది మధుసూదనయ్య, మద్దమ్మ పాల్గొన్నారు.

మిడుతూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ చేపట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మిడుతూరులో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మొక్కలు నాటారు. ఎంపీడీవో దశరథ రామయ్య, తహసీల్దార్ శ్రీనివాసులు, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి పాల్గొన్నారు.



జూపాడుబంగ్లాలో మొక్కకు నీరు పోస్తున్న డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య

వైభవంగా శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

నంద్యాల కల్చరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): హిందూ ప్రచారంలో భాగంగా గురువారం శ్రీశైల దేవస్థాన ధర్మప్రచారం ద్వారా అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో స్వామి, అమ్మవార్ల శోభాయాత్ర, కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ శోభాయాత్ర కళ్యాణదుర్గంలోని వాల్మీకి కూడలి నుంచి బసవేశ్వరస్వామి ఆలయం వరకు నిర్వహించారు. కోలాటం, గొరవనృత్యం, డోలు, వాయిద్యాలు, మొదలైన పలు జానపద కళారూపాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రాత్రి బసవేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామి అమ్మవార్ల కళ్యాణం నిర్వహించారు.

అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం

నంద్యాల కల్చరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ కోసం తూర్పుగోదావరికి చెందిన పుల్లయ్య, రత్నావతి దంపతులు రూ.1,01,116 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ పర్యవేక్షకులు రవి దాతకు రసీదు, ప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రాలు అందించారు. అనంతరం అర్చకులు దాత పుల్లయ్య, రత్నావతి దంపతులను ఆశీర్వదించారు.

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



40 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

మిడుతూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మిడుతూరులోని పోతులూరి వీరబ్రహ్మం గారి మఠం ఆవరణంలో 40 అడుగుల అభయ ఆంజనేయ స్వామి ఏకశిల విగ్రహ ప్రతిష్ఠ, మఠం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా జరిగాయి. టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నందికొట్కూరు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రసాద రెడ్డి, మాండ్రలింగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ఆత్మకూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహజంచారు. లక్ష్మీ సమేత చెన్నకేశవ, అభయాంజనేయ స్వామి వార్లకు ప్రత్యేక అలంకరణ గావించి విశేష పూజలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మంత్రిని కలిసిన 'ఆగ్రో' చైర్మన్



మంత్రి ఫరూక్‌ను కలిసిన సుబ్బనాయుడు

నంద్యాల రూరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఎన్ఎండీ ఫరూక్ కార్యాల యంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ చైర్మన్ మాలే పాటి సుబ్బనాయుడు మంత్రి ఫరూక్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమా పథకాలపై చర్చిం చారు. కార్యకర్తలు ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం: ఎస్పీ

నంద్యాల టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రతి రోజు యోగా చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండొచ్చని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. గురువారం నంద్యాలలోని జిల్లా పోలీసు కార్యాలయంలో రామచంద్ర మిషన్ వారి ఆధ్వర్యంలో మాసాంతర యోగా కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 21న జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐ ఈశ్వరయ్య, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్ సురేశ్ బాబు, ఎస్ఐ దాదాపీరా, యోగా గురువు ఆశా, రామచంద్రా మిషన్ మేనేజర్ శ్రీనివాసులు, జిల్లా పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

యోగా నిత్యజీవితంలో భాగం కావాలి

నంద్యాల హాస్పిటల్: యోగా మన నిత్య జీవితంలో భాగం కావాలని 9వ బెటాలియన్ బాలికల ఎన్‌సీసీ విభాగం కల్నల్ జోబి ఫిలిఫ్ అన్నారు. గురువారం నంద్యాల పట్టణంలోని ప్రథమనంది పుణ్యక్షేత్రంలో యోగా కార్యక్రమం నిర్వహించారు. డా.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ యోగ అంటే వ్యాయామం, సాధనాల సమాహారం అని విద్యార్థులకు యోగ సాధన చేయడం వల్ల జ్ఞాపకశక్తి, మెదడు చురుగ్గా పనిచేస్తుందన్నారు. యోగఆ శిక్షకురాలు డా.లలితాసరస్వతి, డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ శ్రీప్రియ, ఎన్‌సీసీ కేర్‌టేకర్ ఆఫీసర్స్ యామిని, సుష్మ, లక్ష్మీదుర్గ, ఎన్‌సీసీ సిబ్బంది సీనియర్ జేసీవో బాష, దీప్తిసింగ్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో ర్యాలీ

మహానంది: ఎం.తిమ్మాపురం గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమంపై గ్రామ సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. గురువారం ప్రధాన వీధుల్లో యోగాంధ్రను పురస్కరించుకొని ప్రజలను చైతన్య పరిచేందుకు విద్యార్థులు ఫ్లెక్సీలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్, హేమశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు యోగా పోటీలు

నంద్యాల టౌన్: నంద్యాల పట్టణంలో శుక్రవారం యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల పురపాలక ఇన్‌చార్జి కమిషనర్ వెంకటదాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను పురపాలక పరిధిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు విభాగాలుగా 10-18 ఏళ్లు, 19-35 ఏళ్లు, 35 ఏళ్లు పైబడిన వారు వారి సచివాలయాల పరిధిలో పేర్లు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గలవారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

అలరించిన నృత్య ప్రదర్శన

నంద్యాల కల్చరల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): నంద్యాలలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురష్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన వనం మనం కార్యక్రమంలో గురురాజ విద్యార్థుల జానపద నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థలను మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి విద్యార్థులను అభినందించి జ్ఞాపిక అందజేశారు. గురురాజ విద్యాసంస్థల డైరక్టర్ శేక్షావళిరెడ్డి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

నంద్యాల హాస్పిటల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్.వెంకటరమణ అన్నారు. గురువారం జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాక్‌లో నంద్యాల జిల్లా సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్యకార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం జూన్‌లో నిర్వహించే మలేరియా వ్యతిరేక మాసోత్సవ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన పెంచేందుకు ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. అనారోగ్యం బారిన పడితే వైద్యులను సంప్రదించాలని సూచించారు. జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు, సహాయ మలేరియా అధికారి రామవిజయరెడ్డి, జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

నంద్యాల టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణా పీజీ కళాశాలలో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ వంశీధర్ మాట్లాడుతూ ఎవరైనా సైబర్ నేరాగాళ్ల చేతిలో మోసపోతే 1930 నెంబరుకు ఫోను చేయాలన్నారు. సైబర్ క్రైం సిబ్బంది ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు జట్టు విజయం

వెలుగోడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వేల్పనూరులో వేసవికాల ప్రత్యేక క్రికెట్ జిల్లాస్థాయి పోటీలను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నలు మూలల నుంచి 50 జట్లు హాజరయ్యాయి. ఈ పోటీలలో ఆత్మకూరుకు చెందిన పవర్ హిట్టర్ జట్టు విజయం సాధించి రూ.20 వేలు గెలుచుకుంది. వేల్పనూరు జట్టు రన్నర్‌గా నిలిచి రూ.10 వేలు గెలుచుకుంది. పారుమంచాల జట్టు మూడో స్థానంలో నిలువగా రూ.5 వేలు నగదును అందజేశారు. లూర్దుబాబు, సందీప్, నాగరాజు, సురేంద్ర, వేణు, జయన్న పాల్గొన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ



అల్లూరులో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర

నందికొట్కూరు రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరు గ్రామంలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి భూమి పూజ నిర్వహించారు. గురువారం అల్లూరులో జిల్లా విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సుధాకర్‌రావు ఆధ్వర్యంలో భూమి పూజనిర్వహించారు. వారు మాట్లాడుతూ నందికొట్కూరు మండలంలో లో ఓల్టేజీ విద్యుత్ సమస్యలతో కొట్టు మిట్టాడుతున్న అల్లూరు, వడ్డెమాను, కోనేటమ్మపల్లె, శాతనకోట, మల్యాల, జంగంపాడు, గ్రామాలకు ఇక నుంచి నాణ్యమైన విద్యుత్ అందించేందుకు వీలవుతుందన్నారు. ఆత్మకూరు విద్యుత్ ఈఈ జయశంకర్, కన్‌స్ట్రక్షన్ ఈఈ శ్రీనివాసులు, నందికొట్కూరు డీఈ వి. శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రసాదరెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పలుచాని మహేశ్వరెడ్డి, గ్రామ సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

● నందికొట్కూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ప్రంపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య అధికారులతో కలిసి మొక్కలను నాటారు.

● నందికొట్కూరు ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎమ్మెల్యే జయసూర్య పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ వెంకటసుబ్బయ్య తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ, మున్సిపల్ కమిషనర్ బేబి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

జూపాడుబంగ్లా, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా కాసానగర్‌కు చెందిన టీడీపీ నాయకుడు చిన్నరాముడు గుండెపోటుతో మృతిచెందారు. ఎమ్మెల్యే జయసూర్య చిన్నారాముడు పూలమాలవేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నాయకులు సుధాకర్, రవికుమార్‌యాదవ్, నరసింహ, శేఖర్, రాముడు, చిన్నస్వామన్న, శాలు తదితరలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జీవించండి: డీఎస్పీ

వెలుగోడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రతి పండుగలను సోదర భావంతో కలసి మెలసి చేసుకొంటూ ప్రశాంతంగా జీవనం సాగించాలని ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్ అన్నారు. గురువారం వెలుగోడులోని పాత బస్టాండ్ గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ సురేశ్, పాల్గొన్నారు.

అండగా ఉంటా : మాజీ ఎమ్మెల్యే

వెలుగోడు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన ఏ ఒక్క కార్యకర్త, నాయకుడు కాని అధైర్య పడొద్దని, తాను అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ఇటీవల నందికొట్కూర్ హైవేలో టిప్పర్ ఢీకొని అబ్దుల్లాపురం గ్రామానికి చెందిన ఎల్లగౌడ్, రహీంబాషా తీవ్రంగా గాయపడి కర్నూలులో చికిత్స పొందుతున్నారు. శిల్పా కర్నూలు చేరుకొని బాధితులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు అంబాల ప్రభాకరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకటరామిరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, సహారాబాషాలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నంద్యాల టౌన్, జూన్5(ఆంధ్రజ్యోతి): నంద్యాల మండల అయ్యలూరు మెట్ట వద్ద గురువారం రోడ్డు ప్రమాదం జరిగింది. శిరివెళ్ల మండలానికి చెందిన ఖాదర్ హుస్సేన్ అనే ఏసీ మెకానిక్ పని నిమిత్తం నంద్యాలకు వస్తుండగా గుర్తు తెలియన వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయ్యాలయ్యాయి. దీంతో స్థానికులు 108 కు ఫోన్ చేయడంతో స్థానిక నంద్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు అపస్మారక స్థితిలో ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవడం వల్లనే అధిక దిగుబడులు సాధ్యమని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఇంచార్జి ఏడీఆర్ రవికుమార్ పేర్కొన్నారు. ఖరీఫ్ విత్తన దినోత్సవాన్ని పురష్కరించుకుని ఆర్ఏఆర్ఎస్‌లో రైతులతో సమావేశం నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ గాయిత్రి, విశ్రాంత వ్యవసాయాధికారి రామరాజు, రైతులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో చిన్నారికి గాయాలు

కొత్తపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): శివపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం తోటి చిన్నారులతో ఆటలాడుకుంటున్న శ్రీహిత అనే 8ఏళ్ల చిన్నారిని ఓ వీధి కుక్క వెంబడించి దాడి చేసి గాయ పరిచింది. దీంతో చిన్నారిని తండ్రి మద్దిలేటి సమీపంలోని గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. గత కొంత కాలంగా గ్రామంలో వీధి కుక్కల గుంపులు ఎక్కువై చిన్నారులను దాడి చేసి గాయపరుస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శిగా సుధాకర్

నంద్యాల రూరల్ , జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సుధాకర్ ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప తెలిపారు. ఆయన మాట్లాడుతూ గురువారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగినట్లు తెలిపారు. నంద్యాల జీవ నియంత్రణ ప్రయోగశాలలో సహాయ సంచాలకులైన సుధాకర్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గడివేముల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రంధాలయాలు విజ్ఞాన భాండగారాలని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాలు ముగింపు సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహబూబ్‌బాష, విద్యార్థులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి

మహానంది, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం మహానంది పోలీస్ స్టేషన్ ఆవరణలో మండలంలోని ముస్లిం మత పెద్దలతో ఎస్ఐ సమావేశం నిర్వహించారు. అల్లర్లకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

సాయిబాబా సన్నిధిలో ఎస్పీ

● ఘన స్వాగతం పలికిన ఆలయ కమిటీ సభ్యులు
● ప్రత్యేక పూజలు చేసిన ఎస్పీ



ఎస్పీకి స్వాగతం పలుకుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

డోన్ రూరల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని షిరిడీ సాయిబాబా మందిరాన్ని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా గురువారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు, రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, సాయిబాబా ఆలయ కమిటి సభ్యుల ఆలయ మర్యాదలతో ఎస్పీకి ఘనస్వాగతం పలికారు. అనంతరం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేయించి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, టీడీపీ యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్‌రెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, కందుకూరు పార్థసారథి, న్యాయవాది ఆలా మల్లికార్జునరెడ్డి, కొండాసురేష్ తదితరులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి: పర్యావరణాన్ని పరిరక్షిస్తూ మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని షిరిడీ సాయిబాబా మందిరం ఆవరణంలో ధర్మవరం సుబ్బారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం జరగాలని ఆకాంక్షించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



రైతులకు పశువుల దాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఆయన రైతులకు పశు దాణా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయానికి వెళ్లి మహిళలతో మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ విశ్రాంతి భవనం ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం కోట్ల మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు త్వరలో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ నిధులు తల్లుల, రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. నియోజకవర్గంలోని ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాల్లోని 11 గ్రామాలకు కొత్తగా సెల్‌టవర్లు త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు భారతి, ఎంపీడీవో శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణయాదవ్, టీశ్రీనివాసులు, ఖాజాపీర్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యం: ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శ్రమిస్తుందని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మం జూరైన రూ.66,73,834 విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు



చిత్తరేణిపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రుద్రవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రైతులు చిరుధాన్యాల పంటలు సాగు చేస్తే లాభాలు వస్తాయని వికసిత్ సంకల్ప అభియాన్ (భారతీయ చిరు ధాన్యాల పరిశోధన కేంద్రం) శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్, కేవీకే యాగంటిపల్లె శాస్త్రవేత్త లక్ష్మీప్రియ అన్నారు. గురువారం మండలంలోని చిత్తరేణిపల్లె, ముకుందాపురం, తిమ్మనపల్లె గ్రామాల్లో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు చేయించి వాటి ఫలితాలకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. విత్తన శుద్ధి తప్పనిసరి అన్నారు. కేవీకేలో లభించే విత్తనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజు, పహిమ తబస్సుం, ఫణి రాజశేఖర్ విజయరాణి, రైతులు పాల్గొన్నారు.

వక్కిలేరుకు జలకళ



వక్కిలేరులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

చాగలమర్రి, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోదనం గ్రామ సమీపంలో గల వక్కిలేరుకు జలకళ సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు వక్కిలేరులో ప్రవహించడంతో వరదతో కళకళలాడుతోంది. రెండు నెలల నుంచి నీరు లేక ఒట్టిపోయింది. వరద ప్రవహిస్తుండటంతో మూగజీవాలు, కూలీలు, రైతులకు దాహం తీర్చుకునేందుకు వీలు పడింది. పొలాల్లోని బోర్లలో నీటిమట్టం పెరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

పని వేళలు మార్చడం అన్యాయం

డోన్ టౌన్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఎనిమిది గంటల పని విధానాన్ని పది గంటలకు మార్చడం అన్యాయమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి. శివరాం అన్నారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలు రాత్రి వేళల్లో డ్యూటీ చేయాలని తీసుకున్న క్యాబినెట్ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చాలా దుర్మార్గమన్నారు. మండల పట్టణ అధ్యక్షుడు పి. రామాంజనేయులు, నక్కి శ్రీకాంత్, మబండల కోశాధికారి బి. నాగమద్దయ్య పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

● ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి
● ఫారెస్ట్ రేంజర్ శ్రీపతినాయుడు
● ప్రకృతిని ప్రేమించాలి: ఎమ్మెల్యే కోట్ల
● ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

రుద్రవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఫారెస్ట్ రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక కేజీబీవీలో, ఆలమూరులోని పంచాయతీ కార్యాలయం ముందు, ఆదర్శ పాఠశాల ఆవరణలో, అటవీశాఖ పరిధిలోని పలు చోట్ల ఎంపీడీవో భాగ్యలక్ష్మి, ప్రిన్సిపాళ్లు లక్ష్మీదేవి, నాగేశ్వరరావుతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్క రూ ఒకమొక్క నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు శ్రీనివాసరెడ్డి, మస్తర్, మహబూబ్‌ఖాన్, రామక్రిష్ణ, బీట్ ఆఫీసరు నాగహుసేనయ్య, సర్పంచ్ లక్ష్మీదేవి, సాగునీటి సఘం అధ్యక్షుడు కత్తి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

చాగలమర్రి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యతని జాతీయ హైవే రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక టోల్‌ప్లాజా సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

దొర్నిపాడు: ప్రకృతి పరిరక్షణ మన అందరి బాధ్యతని విజయ డెయిరీ మాజీ చైర్మన్ భూమా నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని డబ్ల్యూ.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ ఉసేని ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. నంద్యాల జిల్లా వైద్యాధికారి రాగిరి వెంకటరమణ, పరిపాలన అధికారి డాక్టర్ భరత్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ కన్నయ్య, సూపర్‌వైజర్ భాగ్యమ్మ, సిబ్బంది ఉన్నారు.

డోన్ రూరల్ : పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని అన్న క్యాంటీన్ సమీపంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన జీవనం అందాలంటే ప్రకృతిని ప్రేమించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు, మున్సిపల్ వైస్ చైర్మన్ హరికిషన్, రూరల్ ఎస్ఐ మమత పాల్గొన్నారు.

ప్యాపిలి: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం పిలుపునిచ్చారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యాపకులు నవీన్‌పాటి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఎంఈవో-1 రఘురామిరెడ్డితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం అధికారులతో కలిసి పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. ఎంఈవో-2 ప్రతాప్‌రెడ్డి, ఏపీఎం దాసన్న, ఏపీవో హరిక్రిష్ణ, గ్రామ సర్పంచ్ ఓబులేసు, పాఠశాల హెచ్ఎం విజయకుమార్, గ్రామ కార్యదర్శి జయరామిరెడ్డి, మండల కోఆర్డినేటర్ రమణారెడ్డి ఉన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఎంఈవో-1 రఘురామిరెడ్డి మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇష్తికర్‌బాషా, శివారెడ్డి, ఆదాం పాల్గొన్నారు.



రామాపురంలో మొక్క నాటుతున్న టీడీపీ నాయకుడు

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, ఎంపీడీవో ఫజిల్ రెహిమాన్ అన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి కొత్తబస్టాండు మీదుగా కర్నూలు-నంద్యాల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ర్యాలీలో పొదుపు లక్ష్మి గ్రూపు మహిళలు, అధికారులు, నాయకులు పాల్గొని ప్రతిజ్ఞ చేసి మానవహారాన్ని నిర్వహించారు. అనంతరం కమిషనర్, ఎంపీడీవోలతో పాటు ప్రభుత్వ వైద్యాధికారి తస్లీమా, మెప్మా అధికారి సూర్యనారాయణ మొక్కలు నాటారు.

డోన్ టౌన్: ఆసుపత్రి ఆవరణలో డోన్ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.హనీఫ్‌తో పాటు డా.పీవీ ప్రసాద్, డా. భారతి, డా సుకుమార్, డా. శశికుమార్, డా. వీరేష్, నర్సింగ్ సూపరిం టెండెంట్ నాగరాజి, హెడ్ నర్సు సుధారాణి మొక్కలు నాటారు. డోన్ ఆర్టీసీ డీఎం శశిభూషణ్ ఆర్టీసీ బస్టాండులో, గ్యారేజీలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిపో సూపర్‌వైజర్లు డీవై పుల్లయ్య, జాన్ మోజెస్, యూనియన్ నాయకులు బార్ బాలమద్దయ్య, ఐ.వెంకట రమణారెడ్డి, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

బనగానపల్లె: మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని టీడీపీ నాయకుడు, పాతపాడు సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పాతపాడులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. సర్పంచ్‌తో పాటు సెక్రటరీ శకుంతల, జనసేన నాయకులు షేక్షావలి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. బనగానపల్లెలోని ఎంపీడీవో కార్యాలయంలోను, బాలికల ఉన్నతపాఠశాలలోను ఎంపీడీవో రమణ, ఆయూష్ డాక్టర్ లైకూర్‌సాహెబ్, ఏపీవో ప్రతాప్ గ్రామ సచివాలయ సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్‌ల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో మొక్కలు నాటారు.

కొలిమిగుండ్ల: రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించి, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వీఆర్ లక్ష్మీరెడ్డి, అంబటి జయలక్ష్మీరెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కనకాద్రిపల్లెలో వీఆర్ లక్ష్మీరెడ్డి, వెంకటమల్లారెడ్డి, సర్పంచ్ శివశంకర్, చింతలాయపల్లెలో అంబటి జయలక్ష్మీరెడ్డి, వివేకానందరెడ్డి, ఇటిక్యాలలో తోటశివారెడ్డి, బందార్లపల్లెలో కళ్యాణ్‌రెడ్డి, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రసాదరెడ్డి, ఎంఈవో అబ్దుల్‌కలాం, మీర్జాపురంలో పోరెడ్డి చిన్నపురెడ్డి, తోళ్లమడుగులో రమణయ్య, ఉపాధ్యాయులు, అధికారులు మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

● రామ్‌కో సిమెంట్ పరిశ్రమలో యూనిట్ హెడ్ మీనాక్షీసుందరం, అడ్మిన్ హెడ్ రామరాజు, జీఎం రవికుమార్ తదితరులు పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు.

కోవెలకుంట్ల: సమాజంలో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని నంద్యాల డీఈవో జనార్దనరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఉర్దూ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి అక్కడ మొక్కలు నాటారు. డిప్యూటీ డీఈవో వెంకటరామిరెడ్డి, కోవెలకుంట్ల ఎంఈవో వెంకటసుబ్బయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవుకు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలను నాటి వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని టీడీపీ అవుకు మండల అధ్యక్షుడు ఐ.ఉగ్రసేనారెడ్డి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రామాపురం, సంగపట్నం గ్రామాల్లో సచివాలయ సిబ్బందితో కలసి మొక్కలను నాటారు. అలాగే తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీవో వెంగన్న అధికారులతో కలసి మెక్కలను నాటారు.



రుద్రవరం ఫారెస్టు రేంజ్‌లో మొక్క నాటి సందేశాన్ని ఇస్తున్న రేంజర్ శ్రీపతినాయుడు



డోన్‌లో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి



చాగలమర్రి టోల్‌ప్లాజా వద్ద మొక్క నాటుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ అశోక్‌కుమార్



బేతంచెర్లలో మానవహారం చేస్తున్న అధికారులు, పొదుపు మహిళలు



కనకాద్రిపల్లెలో మొక్క నాటుతున్న వీఆర్ లక్ష్మీరెడ్డి

వెన్నుపోటుకు మారుపేరు వైఎస్ జగన్



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

బనగానపల్లె, జూన్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని దోచుకున్న వ్యక్తి మాజీ సీఎం వైఎస్ జగన్ అని, వెన్నుపోటుకు మారుపేరు ఆయన అని టీడీపీ నాయకులు విమర్శించారు. గురువారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, టీడీపీ నంద్యాల వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, నియోజకవర్గం ముస్లిం మైనార్టీ నాయకుడు రాయలసీమ సలాం, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాశీంభాష, పూలకలాంలు విలేఖర్లతో మాట్లాడారు. ఆస్తిలో చెల్లి, తల్లి మోసం చేసి వెన్నుపోటు పొడిచారన్నారు. వెన్నుపోటు దినం అంటూ వైసీపీ నాయకులు చేపట్టిన నిరసనలకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన లభించలేదని అన్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలన్నారు పట్టణంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం, జుర్రేరు శుద్దీకరణ పనులు, షాదీఖానా నిర్మాణం పనులు, ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు వేసిన ఘనత బీసీదేన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ పాలనలో బ్రిడ్జి గుంతలు కూడా పూడ్చలేని కాటసాని రామిరెడ్డి నేడు బీసీని విమర్శించడం విడ్డూరమన్నారు. నాయకులు మిట్టపల్లె సర్పంచ్ తులసిరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, శ్రీనయ్య, బురానుద్దీన్, కాశీంబాషా, సలాం, కలాం పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణ మండప నిర్మాణానికి విరాళం

రుద్రవరం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాసాపురం వేంకటేశ్వర స్వామి కల్యాణ మండప నిర్మాణానికి శిరువెళ్ల మండలం వీరారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఔతు కోటిరెడ్డి-తులశమ్మ దంపతులు గురువారం నాలుగు లక్షల రూపాయలు విరాళం అందించారు. ఈ విరాళం నగదును ఆలయ చైర్మన్ మధుసూదనరెడ్డి, వైస్ చైర్మన్ రంగనాయకులు, కార్యదర్శి వెంకట నరసింహులుకు ఇచ్చారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ కల్యాణ మండప నిర్మాణానికి విరాళమివ్వడం తృప్తిగా ఉందన్నారు. కల్యాణ మండప అభివృద్ధికి మరింత సహకారం అందిస్తామన్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం

డోన్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లంపల్లి గ్రామంలోని డ్రైనేజీలు లేక మురుగునీరు నిల్వ ఉంటుందని, ఈసమస్యను త్వరలో పరిష్కరిస్తామని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. గురువారం మల్లంపల్లి గ్రామంలో ఓ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. టీడీపీ నాయ కులు జయన్నయాదవ్, ఎస్‌పి సుంకన్న, సుధాకర్, శ్రీనవాస్ యాదవ్ గ్రామ సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె తెలిపారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

బేతంచెర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారి మధుశేఖర్ బహుమతులు ప్రదానం చేశారు. గురువారం గ్రంథాలయ సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం ముగింపు సభ నిర్వహించారు. మే 28 నుంచి జూన్ 5వ తేదీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ, చెస్, కథలు చెప్పడం, చదివించడం నిర్వహించారు. క్విజ్ పోటీలు, డ్రాయింగ్ వేయించారు.

ఘనంగా సీతారాముల ధ్వజ ప్రతిష్ఠ



హోమం చేస్తున్న గ్రామస్థులు

ఆళ్లగడ్డ జూన్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాయపురం గ్రామంలో సీతారామ, లక్ష్మణ హనమత్ సమేత గణపతి ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా వేదపండితుల మం త్రోచ్చా రణతో యాగశాల ప్రవేశం, ద్వారతోరణం, కలశారాధన, సుదర్శన హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గ్రామపెద్దలతో ఆలయ పూజారులు హోమం నిర్వహించారు. సాయంత్రం ధ్వజారోహణం, మహామంగళ హరతి, వేద విన్నపం, తీర్థప్రసాదాలు అంద జేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సంజీవరాయుడు, కార్యని ర్వాహక సభ్యులు, ఎంఆర్‌పీఎస్ బాల ఓబులేసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

సంజామల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ముచ్చలపురి గ్రామంలో మూడు రోజులపాటు జరుగుతున్న విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు గురువారం నాటితో ముగిశాయి. ఉదయం ప్రాతఃకాల పూజలు, గర్భపూజ, యంత్రస్థాపన తదనంతరం విగ్రహ ప్రతిష్ఠ కళాన్యాసాలు, మహాబలి, మహా పూర్ణాహుతి, గోదర్శనం, కుంభాభిషేకం, మంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వేద పండితులు సుధా చక్రవర్తి, వెంకట నరసింహ శర్మ ఆధ్వర్యంలో గౌరీదేవి, గణపతి, సుబ్రమణ్యేశ్వరస్వామి, రాములమ్మ, పోతురాజు, ధ్వజ ప్రతిష్ట ఉత్సవాలు వైభవంగా జరిగాయి. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

124 మందికి ఉద్యోగాలు

బనగానపల్లె, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు 328 మంది హాజరు కాగా ఇందులో 124 మంది అర్హతను సాధించి ఉద్యోగాలు పొందినట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సదాశివమూర్తి తెలిపారు. 10 ప్రైవేటు కంపెనీలు రిక్రూట్ చేసుకున్నట్లు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, సూరింటెండెంట్ అబ్బాస్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా పల్లకీ ఉత్సవం

కొలిమిగుండ్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్లలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురువారం సాయంత్రం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వీడీ రాజగోపాల్, రామక్రిష్ణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఎర్రగుడి గ్రామంలోని సాయి మందిరంలో గురువారం భక్తులు పెద్ద ఎత్తున బాబాను దర్శించుకున్నారు.

చాగలమర్రి: స్థానిక సాయినాథ మందిరంలో గురువారం వేద పండితుడు పవన్‌కుమార్ ఆధ్వర్యంలో సాయి భక్తులు జల, పాలాభిషేకాలు, విశేషపూజలు చేశారు. మహన్యాస రుద్రాభిషేకం, సాయి వ్రతం, ప్రత్యేక హారతులు చేశారు. సాయి పల్లకితో ఊరేగింపు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం

సంజామల, జూన్ 5(ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మండల విద్యా శాఖాధికారి ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. రెండవరోజు యోగాంధ్ర కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మండల కోఆర్డినేటర్ వ్యాయామ సంచాలకులు బాషా పర్యవేక్షణలో మండల యోగా రీసోర్స్ పర్సన్ చిన్న మౌళాలి శిక్షణను ఇచ్చారు. ఉపాధ్యాయులు యోగాసనాలు చేశారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి

● డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ

ఉయ్యాలవాడ, జూన్ 5 (ఆంధ్ర జ్యోతి): పొదుపు సంఘాలను ఎప్పటికప్పుడు బలోపేతం చేయాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. మండల సమాఖ్య ఆయా గ్రామ వీవోల రికార్డులను పరిశీలించారు. క్రమం తప్ప కుండా సమావేశాలు నిర్వహించాలని అన్నారు. ఎంసీపీ ద్వారా పొదుపు మహిళలకు బయోమెట్రిక్ వేయించి వారి అవసరాలకు అనుగుణంగా లోన్లు మంజూరు చేయాలన్నారు.

33వేల పొదుపు సంఘాలకు.. జిల్లాలోని 33వేల పొదుపు సంఘాలకు దాదాపు 1300 కోట్ల రుణాలు ఇచ్చినట్లు పీడీ తెలిపారు. దీంట్లో 179 కోట్లు స్త్రీనిధి కాగా 10.50 కోట్లు ఉన్నతి ద్వారా మిగిలినది బ్యాంకు లింకేజీ ద్వారా ఇచ్చామన్నారు. జిల్లాలో 97శాతం రికవరీ ఉన్నట్లు ఆయన తెలిపారు. అలాగే ఆరు కోట్ల మొండి బకాయిలు ఉన్నాయన్నారు. వీటిని కూడా పూర్తిస్థాయిలో రికవరీ చేస్తామ న్నారు. కర్యాక్రమంలో ఏపీఎం దాసన్న, సీసీలు గంగన్న ఉన్నారు.

ఈద్గాను పరిశీలించిన సీఐ

ఆళ్లగడ్డ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ లింగందిన్నె రోడ్డులో ఉన్న ఈద్గాను గురువారం టౌన్ సీఐ యుగంధర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డీఎస్పీ ప్రమోద్ ఆదేశాల మేరకు ఈద్గాను పరిశీలిం చినట్లు తెలిపారు. 7వ తేదీన పట్టణం లోని ముస్లీంలు బక్రీద్ ప్రార్థన నిమిత్తం ఈద్గా వద్దకు వస్తారని వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈమేరకు తీసుకోవలసిన చర్యలను ముస్లిం మతపెద్దలతో చర్చించారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

అవుకు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): అవుకు పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ హెమీమా గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 6, 7, 8, 9 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. ఈనెల 5వతేదీ నుంచి 20వ తేదీ వరకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 24వతేదీన పాఠశాల స్థాయిలో పరీక్ష నిర్వహించి 25వ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. 26న ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు.

ఉయ్యాలవాడ: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఖాళీగా ఉన్న 7, 8, 9వ తరగతి, అలాగే ఇంటర్మీడియట్ ప్రవేశా నికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ఆదర్శ జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 23లోపు ఆన్ లైన్‌లో దర్‌ఖాస్తు చేసుకోవాలని, 24న పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫలితాలు విడుదల చేసి 26న ధృవపత్రాల పరిశీలించి విద్యార్థులకు ప్రవేశాలకు అనుమతిస్తామని వివరించారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి

చాగలమర్రి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కార్డుదారులకు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ రవికుమార్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ డీలర్లు లబ్ధిదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన వృద్ధులు, దివ్యాంగుల ఇంటి వద్దకే సరుకులు తీసుకెళ్లి ఇవ్వాలని ఆదేశించారు. లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డీటీ విజయ్ కుమార్, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్ పాల్గొన్నారు.